# సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 24 । మార్చి । 2024




**వేణుగోపాలుని సన్నిధిలో..**

మెళియాపుట్టిలో నేటి నుంచి డోలోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏర్పాట్లు పూర్తయ్యాయి.


- IIలో




**ఆటో నుంచి జారిపడి..**

కోటబొమ్మాళిలో ఆటో నుండి జారిపడి ఓ మహిళ మృతి చెందారు. ఆమెది నందిగాం మండలం.

- IIలో



| ఇఫ్తార్ | సహర్ |
|---|---|
| ఆది | సోమ |
| సాయంత్రం | ఉదయం |
| 6.10 | 4.40 |

**రంజాన్ వేళలు**

## న్యూస్‌రీల్

### హిందూ ధర్మ పరిరక్షణకు పాదయాత్ర



దుర్గాప్రసాద్ లోహి

ఇచ్ఛాపురం: హిందూ ధర్మ పరిరక్షణ భాగంలో భారతదేశంలో ఉన్న 51 శక్తిపీఠాలను పాదయాత్ర ద్వారా దర్శించుకుంటున్నామని మధ్యప్రదేశ్ భోపాల్‌కి చెందిన దుర్గాప్రసాద్‌లోహి అన్నారు. శక్తిపీఠాలు దర్శించుకొనే క్రమంలో పాదయాత్ర చేస్తూ దుర్గాప్రసాద్ శనివారం పట్టణం చేరుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 మార్చి 10 వ తేదీన పాల్ నుంచి పాదయాత్ర ప్రారంబించినట్లు పేర్కొన్నారు. రోజుకి 20 కిలోమీటర్ల చొప్పున నడు చుకుంటూ దేశంలో గల 51 శక్తిపీఠాలను దర్శించుకున్న అనంతరం నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్తాన్‌లో గల శక్తిపీఠాలను కూడా దర్శించుకుంటానని అన్నారు.

### జాతీయ పోటీలకు పయనం



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో శ్రీధర్‌రావు, సుందరరావు, సాంబమూర్తి, శివకుమార్ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ ఉషూ పోటీల్లో విజయ బావుటా ఎగురవేసి పతకాల సాధింపుతో జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డాక్టర్ కె.శ్రీధర్‌రావు పిలుపునిచ్చారు. ఈ నెల 26 నుంచి 31 వరకు జమ్మూకశ్మీర్ వేదికగా జరగనున్న జాతీయ పోటీలకు జిల్లా నుంచి రికార్డుస్థాయిలో 18 మంది బాలబాలికలు ఎంపికయ్యారు. ఈ పోటీల కోసం శనివారం ఉదయం ఇక్కడ నుంచి పయనమై వెళ్లారు. ఎంపికైనవారిలో వి.పల్లవి, పి.యాషిత, బి.దేవిప్రియ, వి.చతుర్య, ఎం. జోషిక, కె.సాక్షిత్, కె.మోక్షిత్, ఆర్.నరేంద్రనాయుడు, ఆర్.తన్మయ్, ఎ.ప్రశాంత్, జి.హిమచందర్, డి.లీలామాధవ్, డి.తనూజ్, డి.త్రివేణి, వి.ఝాన్సీ ఉన్నారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు మాస్టారుతో కలిసి శ్రీధర్‌రావు క్రీడాకారులను అభినందించారు.

### క్షేత్ర సహాయకుని తొలగింపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పలాస మండలం బొడ్డపాడు పంచాయతీలోని జాతీయ ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు (ఫీల్డ్ అసిస్టెంట్) పోతనపల్లి సరోజవర్మను విధుల నుంచి తొలగిస్తున్నట్టు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జీవీ చిట్టిరాజు తెలిపారు. ఎన్నికల కోడ్ అతిక్రమించి రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొన్నారన్న ఫిర్యాదు మేరకు రిటర్నింగ్ అధికారి ఆర్డీఓ భరత్ నాయక్ విచారణ చేయగా, ఆరోపణ రుజువు కావడంతో ఆయన సిఫార్సు మేరకు సరోజ వర్మను విధుల నుంచి తొలగిస్తున్నట్టు పీడీ తెలిపారు.

### ఐదో రోజు 720 మంది గైర్హాజరు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు-2024 తుది దశకు చేరుకుంటున్నాయి. ఇప్పటి వరకు ఐదు పరీక్షలు జరగగా.. ఇంకా రెండు పేపర్లకు మాత్రమే పరీక్షలు మిగిలి ఉన్నాయి. ఈనెల 26న బయలాజికల్ సైన్స్, 27న సోషల్ స్టడీస్ పరీక్షలు మిగిలి ఉన్నాయి. దీంతో త్వరలో జరగనున్న మూల్యాంకనంపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఈ మేరకు అధికారులతో సమావేశాలు కూడా నిర్వహిస్తున్నారు.

**పారదర్శకంగా.. పకడ్బందీగా**

గతంలో ఎన్నడూ జరగని విధంగా ఈ ఏడాది ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా పరీక్షలు సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 145 కేంద్రాల్లో జరుగుతున్న ఈ పరీక్షల్లో ఐదోరోజు శనివారం ఫిజికల్ సైన్స్(భౌతికశాస్త్రం) పేపర్ (50మార్కులు)కు విద్యార్థులు పరీక్ష రాశారు. ఉదయం 9.30 నుంచి 11.30 వరకు కొనసాగిన ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 29,886 హాజరు కావాల్సి ఉండగా 29,166 హాజరయ్యారు. వివిధ కారణాలతో 720 మంది గైర్హాజరయ్యారు. గైర్హాజరైన వారిలో రెగ్యులర్ విద్యార్థులు 476 మంది, ప్రైవేటు విద్యార్థులు 244 మంది ఉన్నారు. జిల్లాలో పరీక్ష కేంద్రాలపై మరింత ఫోకస్ చేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు అదనంగా మరో మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. ఇప్పటికే నియామకమైన 7 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను కలుపుకొని మొత్తం 10 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్టయింది.

వీటికితోడు 15 సిట్టింగ్ స్క్వాడ్‌లు పరీక్ష కేంద్రాల్లో విస్తృతంగా తనిఖీలను చేపడుతున్నారు. మొత్తమ్మీద అధికారులు, స్క్వాడ్ బృందాలు కలిపి ఐదో రోజు మొత్తం 40 కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాయి. ఐదోరోజు శనివారం జిల్లాలో ఎలాంటి మాల్‌ప్రాక్టీసులు నమోదుకాలేదని డీఈఓ కె.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు.

# ఆరని మంటలు

- టీడీపీలో ఎగసిపడుతున్న అసమ్మతి జ్వాలలు
- మామిడి గోవింద్‌పై మండిపడిన కలమట
- పాతపట్నంలో చెరువులు, స్థలాలు కబ్జా చేసేస్తాడని వ్యాఖ్యలు
- కలవడానికి వచ్చి గొండు శంకర్‌ను పొమ్మన్న గుండ ఫ్యామిలీ
- నాటకాలు.. వెన్నుపోట్లు చాలంటూ తీవ్ర వ్యాఖ్యలు

'మామిడి గోవింద్ ఓ ఫోర్ ట్వంటీ. రేపు ఎలాగూ గెలవడు. పాతపట్నంలో ఏ మూలన, ఎక్కడ ఏ చెరువు ఉన్నా.. గజం స్థలమున్నా కనిపిస్తుందా? ఒక సెంటు స్థలం కూడా కనిపించదు. కబ్జా చేసేస్తాడు. ఇలాంటి ఫోర్ ట్వంటీ గాళ్లను తెలుగుదేశం అభ్యర్థులుగా పెట్టారు. డబ్బులిచ్చి రాజకీయాలు చేయమంటే మేం చేయలేం. డబ్బుల్లేవు.. డబ్బులేవు అని అధిష్టానం పెద్దలు అన్నారు. నిజమే డబ్బుల్లేవు. అయినా 3 పెడతా అన్నాను. చాలదన్నారు. ఐదు పెడతా అన్నాను. ఇంకా చాలదంటే నేను నా ఆస్తులు అమ్ముకుని రోడ్డెక్కాలి. ఇప్పటికే చాలా ఆస్తులు అమ్ముకున్నాను. అయినప్పటికీ నన్ను కాదని మామిడి గోవింద్‌కు టిక్కెట్ ఇచ్చారు. ఆయనొక అనామకుడు. మీ ఇంటిలో ఉన్న ఆడోళ్లే అంటున్నారు మామిడి గోవింద్ ఎవరని. అలాంటి వాళ్లకు టిక్కెట్ ఇస్తే గెలుస్తారా? ఇంత చేసి చంద్రబాబు గానీ, లోకేష్ గానీ, అచ్చెన్నాయుడు గాని, రామ్మోహన్‌నాయుడు గాని ఫోన్ కూడా చేయలేదు. ఎందుకిలా జరిగిందని చెప్పే ప్రయత్నం చేయలేదు. కనీసం ఎంపీకైనా ఓట్లు అక్కర్లేదా?'

– తనను కలిసిన పార్టీ నాయకులతో కలమట వెంకటరమణ ఆవేదనతో చేసిన వ్యాఖ్యలివి.

### గొండుకు అవమానం

అధిష్టానం శ్రీకాకుళం అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత గుండ లక్ష్మీదేవి ఇంటికి శుక్రవారం రాత్రి సతీసమేతంగా, కుటుంబ సభ్యులతో కలిసి గొండు శంకర్ వెళ్లారు. విషయం తెలుసుకున్న గుండ లక్ష్మీదేవి అనుచరులు వచ్చి గొండు శంకర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడికి ఎవరు రమ్మన్నారని మండిపడ్డారు. గుండ దంపతులను కలుస్తామని వేడుకున్నా వినలేదు సరికదా నోటికొచ్చినట్టు రెచ్చిపోయారు. దుర్భాషలాడి, కేకలు వేయడంతో లోపల ఉన్న గుండ అప్పలసూర్యనారాయణ బయటికొచ్చారు. నా అనుమతి లేకుండా ఎందుకు వచ్చావంటూ కేకలు వేశారు. ఇంతలో లక్ష్మీదేవి కూడా జోక్యం చేసుకుని.. నీ నాటకాలు చాలు... ఇక్కడి నుంచి వెళ్లండంటూ పొమ్మన్నారు. మొత్తానికి గొండు శంకర్‌ను ఇంటి గుమ్మం వద్దే నిలబెట్టి అవమానించారు.

### ఎన్నికల్లో సత్తా చూపిస్తాం


'ఎమ్మెల్సీ ఇస్తామన్నా ఒప్పుకోను. ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తే నిర్ణయంలో మార్పు ఉంటుంది. గ్రూపులు సృష్టించే వాళ్లకే ప్రాధాన్యం కల్పించారు. అచ్చెన్నాయుడికి ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదు. 40ఏళ్లు కష్టపడిన దానికి పార్టీ ఇచ్చిన బహుమతి ఇదా? లక్ష్మీదేవికి టిక్కెట్ ఇస్తేనే పార్టీ వెంట ఉంటాం. లేదంటే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తాం.

– విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, అనుచరుల ఆవేదన ఇదీ



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

జిల్లా టీడీపీలో సీటు మంటలు ఇంకా ఆరలేదు. పార్టీలోని సీనియర్లు అంతా టిక్కెట్లు ప్రకటించిన తీరుపై మండిపడుతున్నారు. డబ్బులకు అమ్ముడు పోయి అసమర్థులకు టిక్కెట్లు ఇచ్చారంటూ ధ్వజమెత్తుతున్నారు. శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల్లో టీడీపీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. అధిష్టానం తమ నిర్ణయాలను ఉపసంహరించుకోకపోతే ఎన్నికల్లో తమ సత్తా ఏంటో చూపిస్తామని కార్యకర్తలు హెచ్చరించారు. పాతపట్నంలో టిక్కెట్ ఆశించి భంగపడిన కలమట వెంకటరమణ తన నివాసం వద్దకు వచ్చిన సానుభూతి పరులతో సమావేశమై అటు అధిష్టానంపైన, ఇటు మామిడి గోవింద్‌పైన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఒక కబ్జాకోరును తీసుకొచ్చి పాతపట్నంలో నిలబెడుతున్నారని, ఆ వ్యక్తిని పార్టీ శ్రేణులే కాదు ప్రజలు కూడా ఛీకొడుతున్నారని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేగా ఎలాగూ గెలవడు.. పార్టీ ఇన్‌చార్జిగా ఉన్నా పాతపట్నం నియోజకవర్గంలో గజం స్థలం కూడా కనిపిచకుండా కబ్జా చేసేస్తాడని అన్నారు. ప్రజలు కాదు టీడీపీ కార్యకర్తలే ఆయన్ని ఓడిస్తారని ఘాటుగా స్పందించారు. అధిష్టానం కూడా డబ్బులకే ప్రాధాన్యత ఇచ్చింది తప్ప పార్టీ కోసం పనిచేసిన వాడికి అన్యాయం చేసిందన్నారు. ఒకటి రెండు రోజుల్లో నియోజకవర్గ కేడర్‌తో సమావేశమై అందరి అభిప్రాయం మేరకు నడుచుకుంటానని స్పష్టం చేశారు. ఇండిపెండెంట్‌గానైనా పోటీ చేస్తానని సంకేతాలిచ్చారు. తన స్థాయి మేరకు ఖర్చు పెట్టి ఎన్నికల్లో సత్తా చాటుతానని కేడర్‌కు హామీ ఇచ్చారు.




శ్రీకాకుళంలో సీటు తెచ్చుకున్న గొండు శంకర్‌పై ఆ పార్టీ సీనియర్లంతా రగిలిపోతున్నారు. ఆయన పేరు ఎత్తితేనే మండిపడుతున్నారు. కోట్లిచ్చి టిక్కెట్ కొనుక్కొని పోటీ చేద్దామంటే కుదరదని, ఎన్నికల్లో ఓడించక తప్పదని హెచ్చరిస్తున్నారు. ఇండిపెండెంట్‌గా తప్పనిసరిగా పోటీ చేస్తామని ప్రకటించారు. గుండ లక్ష్మీదేవి ఇంటి వద్దే ఉంటూ తమ నిరసన తెలియజేస్తున్నారు. అధిష్టానం తీరును దుయ్యబడుతున్నారు. అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు ఆడిన డ్రామాలో భాగమే ఇదంతా అని, ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని వార్నింగ్ ఇచ్చారు. గొండు శంకర్ నంగనాచి వేషాలు వేస్తున్నారని, వెన్నుపోటు పొడిచి ఆశీర్వాదం కోసం వస్తే కరిగిపోతామా? అని గుండ అనుచరులు రగిలిపోతున్నారు. పార్టీ అమ్ముడుపోయిందని, సిద్ధాంతాలను పక్కన పెట్టేశారని, టిక్కెట్లను అంగడి సరుకులా అమ్మేశారని దుయ్యబడుతున్నా రు. అంతా చేసేసి ఇప్పుడు ప్రలోభాలకు గురి చేస్తే లొంగిపోయేది లేదని, ఎమ్మెల్సీ ఇతరత్రా పదవులిస్తామని చెప్పినా నమ్మేది లేదని, అలాంటివేవీ అక్కర్లేదని ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తేనే పార్టీ వెంట నడుస్తామని కూడా స్పష్టం చేశారు. మొత్తానికి అటు పాతపట్నంలోనూ, ఇటు శ్రీకాకుళంలోనూ టీడీపీలో చెలరేగిన అసమ్మతి మంటలు ఆరడం లేదు.




సంఘటన స్థలంలో లోకనాథం మృతదేహం (ఇన్‌సెట్) చిడిపల్లి లోకనాథం (ఫైల్)




సంఘటన స్థలంలో మృతి చెందిన కూర్మారావు (ఇన్‌సెట్) కూర్మారావు (ఫైల్)

# భల్లూక బీభత్సం

- అనకాపల్లిలో ఎలుగు అలజడి
- ముగ్గురిపై దాడికి తెగబడిన మృగం
- ఇద్దరు మృతి, ఒకరి పరిస్థితి విషమం
- ఉద్దానంలో భయానక వాతావరణం

వజ్రపుకొత్తూరు రూరల్:

ఉద్దానంలో భల్లూకం మరోసారి బీభత్సం సృష్టించింది. వజ్రపుకొత్తూరు మండలం చీపురపల్లి పంచాయతీ పరిధిలో గల అనకాపల్లి గ్రామంలో ముగ్గురిపై దాడి చేయగా.. అందులో ఇద్దరు జీడి రైతులు అప్పికొండ కూర్మారావు(49), చిడిపల్లి లోకనాథం (47) అక్కడికక్కడే మృతి చెందారు. మరో మహిళ చిడిపల్లి సావిత్రి తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..

గ్రామానికి చెందిన జీడి రైతులు అప్పికొండ కూర్మారావు, చిడిపల్లి లోకనాథం ఆయన భార్య చిడిపల్లి సావిత్రిలు శనివారం జీడితోటకు వెళ్లారు. ప్రస్తుతం జీడి పిందె దశలో ఉండటంతో చెట్టు కింద ఉన్న ఎండుటాకులను పోగు చేస్తున్న చిడిపల్లి సావిత్రిపై అటుగా వచ్చిన ఎలుగు ఒక్కసారిగా దాడి చేసింది. దీంతో పక్కనే ఉన్న సావిత్రి భర్త చిడిపల్లి లోకనాథం గట్టిగా అరుస్తూ భార్య ప్రాణాలను కాపాడే ప్రయత్నం చేశారు. దీంతో ఎలుగు సావిత్రిని విడిచిపెట్టి లోకనాథం ముఖం, తల, చెయ్యి, కాలిపై తీవ్రంగా దాడి చేసింది. మరో పక్క తోటలో ట్రాక్టర్‌తో దున్నుతున్న అప్పికొండ కూర్మారావు సంఘటన స్థలానికి రావడంతో అతనిపై కూడా విచక్షణారహితంగా దాడి చేసింది. దీంతో లోకనాథం, కూర్మారావులు అక్కడికక్కడే ఊపిరి వదిలేశారు. సావిత్రి తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతుండగా స్థానికులు పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహాలను కూడా అదే ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతుడు కూర్మారావుకు భార్య కృష్ణవేణి, కుమార్తె విజయలక్ష్మి, కుమారుడు శ్రీకాంత్ ఉన్నాడు. ఈయన వార్డు మెంబర్ కూడా. అలాగే మరో మృతుడు లోకనాథం భార్య సావిత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరి మృతితో స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి.



తీవ్ర గాయాలతో సావిత్రి

**గ్రామస్తుల చేతిలో ఎలుగు హతం**

ఇద్దరి చావుకు కారణమైన ఎలుగును గ్రామస్తులు హతమార్చారు. అటవీ శాఖాధికారుల నిర్లక్ష్యమే రైతుల చావుకి కారణం అంటూ స్థానికులు తీవ్ర స్థాయిలో అరోపించారు. కాశీబుగ్గలో ఆందోళన కూడా నిర్వహించారు.

**వణుకుతున్న ఉద్దానం**

ఇటీవల తరచూ ఎలుగుబంట్లు జీడితోటల్లోకి వచ్చేస్తున్నాయి. నెల వ్యవధిలో డెప్పూరు, ఎం.గడూరు, అనకాపల్లి గ్రామాల్లో దాడికి దిగాయి. వజ్రపుకొత్తూరులో ఇద్దరు చనిపోయారు. కిడిసింగిలో మరో జీడి రైతు కూడా మృతి చెందారు. రాత్రి సమయాల్లో వీధుల్లోకి వచ్చేస్తున్నాయి.

### ఆదుకుంటాం : మంత్రి సీదిరి

కాశీబుగ్గ: ఎలుగు దాడికి గురైన మహిళను మంత్రి సీదిరి అప్పలరాజు పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో శనివారం పరామర్శించారు. మృతదేహాలను కూడా పరిశీలించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. గాయపడిన మహిళను ప్రైవేటు ఆస్పత్రికి తరలించామని, ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్‌సి ఛైర్మన్ డబ్బీరు భవానీశంకర్, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, వజ్రపుకొత్తూరు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




మహిళను పరామర్శిస్తున్న మంత్రి అప్పలరాజు

### రూ.1.36 లక్షల నగదు సీజ్

పాతపట్నం: ఎన్నికల విధుల్లో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ నిర్వహించిన సోదాల్లో రూ.1.36 లక్షల నగదు పట్టుకుని సీజ్ చేసినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి డీటీ శైలజ తెలిపారు. శనివారం మండలంలోని సీది కూడలి వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది పర్లాకిమిడి(ఒడిశా) నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న బొలేరోని ఆపి తనిఖీ చేయగా.. అందులో రూ.1.36 లక్షల నగదు లభ్యమైనట్లు తెలిపారు. బండిలో ఉన్న వ్యక్తి పర్లాకిమిడి మార్కెట్ వీధికి చెందిన పొట్నూరు శివ ప్రసాద్. ఈ నగదుకు సంబంధించిన ఆధారాలు చూపించకపోవడంతో నగదుని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు స్థానిక పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. నగదును ట్రెజరీకి తరలించామని అన్నారు. రూ.50 వేలకు మించి నగదుతో ప్రయాణం చేస్తే సరైన ఆధారాలు తమ వెంట ఉంచుకోవాలని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తెలిపారు.



తహసీల్దార్ కార్యాలయంలో రూ.1.36 లక్షలు పట్టుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు




### మారుమూల ప్రాంతాల్లో..

మందస: ఎన్నికలు సమర్థంగా నిర్వహించడానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. మందస మండలంలో శనివారం ఆయన పర్యటించారు. ముందుగా కమిషనర్‌తో జరిగిన కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం చిన్నకోస్టా(109) పోలింగ్ స్టేషన్, సిద్ధిగాం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను పరిశీలించారు. సిరిపురం చెక్‌పోస్టును కూడా పరిశీలించి, వాహనాలను తనిఖీలను సక్రమంగా చేయాలన్నారు. కురడాలులో నిర్వహిస్తున్న 104 వైద్యసేవలను పరిశీలించి, మందులు, వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పలాస ఆర్డీఓ భరత్‌నాయక్, డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, మందస తహసీల్దార్ తిరుమలబాబు, ఎంపీడీఓ అరసాడ రఘుపతిపతిరావు, సీఐ పి.ఈశ్వరరావు, ఎస్ఐ అనిల్‌కుమార్, సివిల్‌సప్లై డీటీ శానాపతి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సిద్ధిగాం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

### సోషల్ మీడియాలో తప్పుడు వార్తలపై నిఘా

శ్రీకాకుళం క్రైమ్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆన్‌లైన్ వేధింపులు, సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, ప్రచారాలు చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఆమె శనివారం మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా తప్పుదారి పట్టించే సమాచారం, మార్ఫింగ్ చేసే ఫొటోలు, వీడియోలు పోస్టు చేయడం, ఫార్వర్డు చేయడం నేరమన్నారు. ఎన్నికల నియమావళి, ఉల్లంఘించిన వారిపై ఫిర్యాదు చేయడానికి హెల్ప్‌లైన్ నంబర్ 1950కి లేదా 08942- 240606కు కాల్ చేయాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని ఎస్పీ కోరారు.




మాట్లాడుతున్న ఎస్పీ జీఆర్ రాధిక

# పొత్తులో మిత్రపక్షాలు చిత్తు

- శ్రీకాకుళం పార్లమెంట్‌లో మిత్రపక్షాలకు గుండు సున్నా
- ఐదోసారి పొత్తులో బీజేపీకి దక్కని టిక్కెట్
- టీడీపీ జెండా మోయడమే మా పనా అంటూ కాషాయ దళం ధ్వజం
- ఇప్పటికే సమావేశమైన బీజేపీ నాయకులు
- పూర్తి నైరాశ్యంలో జనసేన
- దానేటి శ్రీధర్‌కు తప్పని నిరాశ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

'టీడీపీతో పొత్తు అంటే ఇలాగే ఉంటుంది. ఇదేమీ కొత్త కాదు. మనకు అలవాటైపోయింది. కానీ ఈసారి అలా జరగదని అనుకున్నాం. కానీ అదే జరిగింది. మరోసారి పొత్తు కౌగిట్లో నలిగిపోయాం. చంద్రబాబు మరోసారి మోసం చేశాడు. శ్రీకాకుళం పార్లమెంట్‌లో ఒక్క సీటు ఇవ్వలేదు. గతం కంటే బాగా బలపడ్డాం. సొంతంగా పోటీ చేసి గెలవగల సామర్థ్యం ఉంది. పొత్తు ధర్మంలో సరే అన్నాం. పలాస, పాతపట్నం, శ్రీకాకుళంలో ఏదో ఒక నియోజకవర్గం వస్తుందని అనుకున్నాం. కానీ వెన్నుపోటు పొడిచారు. అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు అడ్డుకున్నారు.'

-ఇదీ శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలోని బీజేపీ నాయకుల ఆవేదన.

### బీజేపీలో పొత్తు గోడు

తమతో సంప్రదించకుండా ఏకపక్షంగా అభ్యర్థులను ప్రకటించేసి పొత్తు ధర్మాన్ని విస్మరించారంటూ టీడీపీ అధిష్టానం తీరును తప్పు పడుతూ శ్రీకాకుళం బీజేపీ నాయకులు ధ్వజమెత్తుతున్నారు. చంద్రబాబు తీరుపై గుర్రుగా ఉన్నారు. ఇప్పటివరకు ఐదు సార్లు టీడీపీతో పొత్తు జరిగినా ఒక్కసారి కూడా బీజేపీకి జిల్లాలో అవకాశం కల్పించలేదని, ఈ సారి కూడా అదే జరిగిందని, ఇలాగైతే ఓటు బదిలీ జరగడం కష్టమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంట్‌లో ఏదైనా ఒక నియోజకవర్గం కేటాయించాలని పార్టీ నాయకత్వాన్ని కోరుతూ ఓ చోట సమావేశమై తీర్మానం చేశారు. దీంట్లో తమ అసంతృప్తిని తెలియజేయడమే కాకుండా మరికొన్ని విషయాలను ప్రస్తావించారు. తమకు సీటు రాకుండా అడ్డుకున్నది అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడే అంటూ పేర్కొనట్టు తెలిసింది.



శ్రీకాకుళంలో సమావేశమైన బీజేపీ నాయకులు




### పునః పరిశీలన కోసం డిమాండ్

పొత్తుతో పాటు సీట్ల కేటాయింపుపై కూడా పునపరిశీలన చేయాలని ఆ తీర్మానంలో రాసినట్టు సమాచారం. ఈ తీర్మానం సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, పైడి వేణుగోపాలం, పూడి తిరుపతిరావు, అట్టాడ రవి బాబ్జీ, శవ్వాన ఉమామహేశ్వరి, చల్లా వెంకటేశ్వరరావు, సిరిపురం తేజేశ్వరరావు, వరదరాజ రాజ్ పురోహిత, పైడి రాజారావు తదితరులు పాల్గొన్నారు. వాస్తవంగా ప్రతి నియోజకవర్గం నుంచి ముగ్గురేసి అభ్యర్థులను బీజేపీ అధిష్టానానికి జిల్లా నాయకత్వం పంపించింది. పొత్తు లేకపోయి ఉంటే అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేయడానికి సిద్ధమయ్యేవారు. ఎప్పుడైతే పొత్తు కుదిరిందో కనీసం ఒక సీటైనా వస్తుందని ఆశించారు. పార్లమెంట్ పరిధిలో బిర్లంగి ఉమామహేశ్వరరావు, పైడి వేణుగోపాల్, పూడి తిరుపతి రావు, కణితి విశ్వనాథం సతీమణి తదితరులు ప్రధాన ఆశావహులుగా ఉన్నారు. వీరితో పాటు తాజాగా పార్టీలో చేరిన సిరిపురం తేజేశ్వరరావు కూడా పాతపట్నం టిక్కెట్ ఆశించారు. వీరందరికీ నిరాశే ఎదురైంది.

### జనసున్నా..

సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్నట్టుగా జనసైనికులంతా మిత్రపక్షం పల్లకీ మోయడానికే పరిమితమైపోయారు. పార్లమెంట్ పరిధిలో ఒక్క సీటు కూడా వారికి దక్కలేదు. జనసైనికులు తీవ్ర నిరాశకు గురై జెండా కూలీలుగా మారిపోతున్నామన్న ఆవేదనతో ఉన్నారు.పాతపట్నం, శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, ఎచ్చెర్లలో ఏదో ఒక నియోజకవర్గం తమకు వస్తుందని ఆశ పడ్డారు. ఎన్నికల్లో గ్లాసు గుర్తు కనబడుతుందని భావించారు. కానీ వారి ఆశలు అడియాశలయ్యాయి. ముఖ్యంగా ఈసారి ఎలాగైనా పోటీ చేయాలన్న ఏకైక లక్ష్యంతో ఎన్నికలకు ముందు జనసేనలో చేరిన డాక్టర్ దానేటి శ్రీధర్‌కు చేదు అనుభవం ఎదురైంది. శ్రీకాకుళంలో గానీ, పలాసలో గానీ పోటీ చేసే అవకాశం వస్తుందని ఆశపడ్డారు. తాను ఎంతైనా ఖర్చు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నానని అధిష్టానానికి హామీ కూడా ఇచ్చారు. కానీ జనసేన అధినేత పవన్ కల్యాణ్ కనికరించలేదు. పొత్తులో భాగంగా చంద్రబాబుకు తలొగ్గి దానేటికి మొండి చేయి చూపారు. ఇప్పుడేం చేయాలో ఆయనకు పాలు పోవడం లేదు. ఇక గత పదేళ్లుగా పార్టీకి కోట్లు ఖర్చు పెట్టి పనిచేసిన నాయకులకు తీవ్ర అన్యాయం జరిగింది. పార్టీ కోసం ఆస్తులు అమ్ముకుని పనిచేస్తే చివరికి మోసపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## క్లుప్తంగా

### డ్రైవింగ్ స్కూల్ 15వ బ్యాచ్ ప్రారంభం



శిక్షణ అభ్యర్థికి డ్రైవింగ్ పుస్తకం అందజేస్తున్న డీఎం మల్లికార్జునరాజు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో అర్హులైన అభ్యర్థులకు ఇచ్చే హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ పి.మల్లికార్జునరాజు అన్నారు. శ్రీకాకుళంలోని ఏపీఎస్ ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 15వ బ్యాచ్‌ను శ్రీకాకుళం-1 డిపో మేనేజర్ పి.బి.ఎం.కె రాజు చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఇక్కడ డ్రైవింగ్‌తో పాటు మెకానికల్ వర్క్, యోగా, ప్రథమ చికిత్స, ట్రాఫిక్‌కు విషయాలు కూడా చెబుతారని అన్నారు. తదుపరి బ్యాచ్‌లో చేరదలుచుకునేవారు నేరుగా శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ డ్రైవింగ్ స్కూల్‌ను సంప్రదించవచ్చని లేదా 9963091999, 7382923293 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శ్రీకాకుళం-2డిపో మేనేజర్ కేఆర్ఎస్ శర్మ, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

### 'పారదర్శకంగా టెన్త్ స్పాట్ నిర్వహించాలి'



డీఈఓ వెంకటేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎస్ఎల్‌టీఏ జిల్లా సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి మూల్యాంకనాన్ని శ్రీకాకుళం జిల్లాలో పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్ఎల్‌టీఏ)జిల్లాశాఖ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈఓ కె.వెంకటేశ్వరరావును కలిసి వినితి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు పిసిని వసంతరావు, ప్రధాన కార్యదర్శి కూన రంగనాయకులు మాట్లాడుతూ తాజాగా విడుదల చేసిన సీనియారిటీ జాబితా లోపభూయిష్టంగా ఉందని.. దాన్ని వెంటనే సవరించాలని కోరారు. అలాగే మూల్యాంకన కేంద్రంలో అన్ని మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించాలని కోరారు. అలాగే దీర్ఘకాలిక సమస్యలతో సతమతమవుతున్న ఉపాధ్యాయులు, గర్భిణులకు మూల్యాంకనం నుంచి మినహాయింపు ఇవ్వాలని విన్నవించారు. తెలుగు మూల్యాంకనంలో వేర్వేరు పేపర్లకు విడివిడిగా సీనియారిటీ జాబితాలు రూపొందించి నియామకాలు కల్పించాలని వసంతరావు, రంగనాయకులు డీఈఓకు విజ్ఞప్తి చేశారు. డీఈఓను కలిసినవారిలో ఆ సంఘ ప్రతినిధులు కుప్పన్నగారి శ్రీనివాసరావు, గౌడబ మేరీప్రసాద్, చింతపల్లి జనార్ధనరావు, తదితరులు ఉన్నారు.

# వేణుగోపాలుని సన్నిధిలో..



వేణుగోపాల ఆలయం



గర్భగుడిలో విగ్రహాలు

- నేటి నుంచి మెళియాపుట్టిలో డోలోత్సవాలు
- కట్టిపడేసే శిల్ప కళ ఆలయ సొంతం

మెళియాపుట్టి: మెళియాపుట్టి వేణుగోపాల స్వామి ఆలయం డోలోత్సవాలకు సిద్ధమైంది. 1840లో పర్లాకిమిడి మహారాజు ప్రతాపరుద్రుని భార్య విష్ణుప్రియ మహారాణి కోరిక మేరకు ఆలయాన్ని కట్టించారు. పర్లాకిమిడి నగరానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న మహేంద్రతనయ నదీతీరాన మెళియాపుట్టిలో ఉన్న ఈ ఆలయం అపురూప శిల్పకళకు ఆలవాలంగా నిలుస్తోంది.

**ఏటా ఘనంగా డోలోత్సవాలు**

ఏటా స్వామి వారి డోలోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఆదివారం నుంచి ఇక్కడ డోలోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రారంభానికి ముందు రోజు రాత్రి రాజవంశీయులు హాజరై స్వామికి ప్రత్యేక పూజలు, మఖ కార్యక్రమం నిర్వహించి పురవీధుల్లో ఊరేగిస్తారు. తొమ్మిది రోజుల పాటు జరిగే డోలో యాత్రలో అనేక పౌరాణిక జానపద, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. సుదూర ప్రాంతాలనుంచి యాత్రికులు పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారు. ఆలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ఒకప్పుడు పూజా కార్యక్రమాలు, శుభకార్యాలు చేసేటప్పుడు ఆయా గదుల్లో సామగ్రి నిల్వచేసి ప్రజలు సేదతీరేవారు. ప్రస్తుతం గదులన్నీ పిచ్చిమొక్కలతో అధ్వానంగా తయారయ్యాయి.

## అభిమాని కానుక



'నాలో నేను-నాతో నేను' సీడీ కిట్‌ను అందజేస్తున్న పార్టీ అభిమాని గుడ్ల సాయి

పొందూరు: పొందూరులో శనివారం స్పీకర్ తమ్మినేని సీతారాం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచంటి వీధిలోని వైఎస్సార్‌సీపీ అభిమాని గుడ్ల సాయి కుటుంబ సభ్యులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవిత కథలతో రూపొందించిన నాలో నేను-నాతో నేను అనే సీడీ కిట్‌ను స్పీకర్ తమ్మినేనికి కానుకగా అందించారు. పార్టీపై అభిమానాన్ని ఇలా చూపారు.

# టీడీపీలో సీట్లు అమ్ముకుంటున్నారు



వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అవినీతి, అక్రమాలు, మోసాలకు కేరాఫ్ టీడీపీ అని ఎమ్మెల్యే సీట్లను డబ్బులకు అమ్ముకుంటున్నారని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు విమర్శించారు. మూడుసార్లు కౌన్సిలర్‌గా చేసిన బస్వా లక్ష్మి తనయుడు బస్వా మాధవ్ అండ్ టీమ్ వైఎస్సార్‌సీపీలో చేరడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి వారు పార్టీలో చేరడం పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు. శ్రీకాకుళం నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం టౌన్‌హాల్‌లో శనివారం రాత్రి కాకివీధి, మేదరవీధుల నుంచి 50 కుటుంబాలు పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన మాధవ్ మాట్లాడుతూ ధర్మాన గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణ, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఎంవీ పద్మావతి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శిమ్మ రాజశేఖర్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రొతు శంకరరావు, ఎం ఏ రఫీ, అంబటి శ్రీను, మూకళ్ల తాతబాబు, నక్క రామరాజు, ఆలుగుబెల్లి నాగభూషణరావు, రుప్ప శేషగిరిరావు, అంధవరపు రమేష్ పాల్గొన్నారు.

**ప్రభుత్వం దృష్టికి జర్నలిస్టుల డిమాండ్లు**

శ్రీకాకుళం రూరల్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వారి డిమాండ్లను ప్రభుత్వం తీసుకెళ్తామని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు హామీ ఇచ్చారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా శనివారం ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ నాయకులు మంత్రిని పెదపాడులోని ధర్మాన క్యాంప్‌లో కలిసి సమస్యలను విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు, ప్రతినిధులు ఈశ్వరావు, చైతన్య పాల్గొన్నారు.

# 'పరిశోధనాత్మక విద్యతోనే ప్రగతి'



మాట్లాడుతున్న థెర్మోఫిషర్ సైంటిఫిక్ సంస్థ సౌత్ ఏషియా జనరల్ మేనేజర్ జయభరత్ రెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: పరిశోధనాత్మక విద్యతో ప్రగతి సాధ్యమని ముంబైకి చెందిన థెర్మోఫిషర్ సైంటిఫిక్ సంస్థ సౌత్ఏషియా జనరల్ మేనేజర్ జయభరత్ రెడ్డి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో వర్సిటీ, థెర్మో ఫిషర్ సైంటిఫిక్ సంస్థ సంయుక్తంగా నూతన ఆవిష్కరణల కోసం పారిశ్రామిక సమ్మేళనం అన్న అంశంపై ఒక్క రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నూతన ఆలోచనలు ఉండాలన్నారు. ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల ద్వారా పారిశ్రామిక రంగంలో అనేక మార్పులు వస్తాయని తెలిపారు. ప్రస్తుతం సాంకేతిక ప్రగతి విస్తరిస్తోందని, కృత్రిమ మేధ రావడంతో పరిశ్రమల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. ప్రస్తుతం విద్యావిధానంలో సైతం అనేక మార్పులు వస్తున్నాయని చెప్పారు. నిరంతర పరిశోధనలతో వైద్య, సాంకేతిక, జీవశాస్త్ర, ఫార్మా, బయోటెక్నాలజీ రంగాల్లో మార్పులు వస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ కేఆర్ రజిని, రిజిస్ట్రార్ పి.సుజాత, రెక్టార్ బి.అడ్డయ్య, సెమినార్ కన్వీనర్ ఆంధ్రావిశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పీఎస్‌పీ ధనుంజయ, పలువురు పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

## 28న జెమ్స్‌కు మాజీ ఐఏఎస్ అధికారి రాక

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రి అనుబంధం బొల్లినేని మెడిస్కిల్స్‌కు ఈనెల 28న మాజీ ఐఏఎస్ అధికారి చక్రపాణి రానున్నట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గల విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సదస్సుకు హాజరయ్యే విద్యార్థులకు గాను అమెరికాలోని హెల్త్ టెక్నాలజీ కంపెనీ ఆధ్వర్యంలో మూడు నెలలు పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 7680945357 అనే నంబర్‌ను సంప్రదించాలన్నారు.

## 'వైద్య సదుపాయాలు వినియోగించుకోండి'



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

పలాస: 'గతంలో కిడ్నీ రోగులకు వైద్యసదుపాయాలు లేవు. ఇప్పుడు ఇంటి వద్దకే వైద్యం అందుతోంది. పలాసలో కిడ్నీ ఆస్పత్రి కూడా వచ్చింది. వినియోగించుకోండి' అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో శనివారం కిడ్నీ వ్యాధులపై అవగాహన సదస్సు, మెగా వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో మొత్తం 276 మందికి రక్త పరీక్షలు, ఇతర పరీక్షలు చేశారు. జనరల్ ఓపీ 83, కిడ్నీ పరీక్షలు 193 పరీక్షలు చేశారు. అత్యధిక శాతం కిడ్నీ రోగులు ఉన్నట్టు రోగులు గుర్తించారు. వారికి మందులు సరఫరా చేశారు. ఈ వైద్య శిబిరంలో రెంటికోట పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్ కుమార్‌తో పాటు, నెఫ్రాలజిస్టు కె.విద్యాసాగర్, డాక్టరు మౌనిక, డాక్టరు దేవి, డాక్టరు తేజేశ్వరి, డాక్టరు చిన్ని, సుమారు 35 మంది వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలాస జూనియర్ ఇన్‌చార్జి సివిల్ జడ్జి బి.ఎం.ఆర్ ప్రసన్నలత అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తితో పాటు డీఎంహెచ్ఓ బొడ్డేపల్లి మీనాక్షి మాట్లాడుతూ హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ అవగాహన ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. నెఫ్రాలజిస్టు సూచనల విధిగా పాటించాలని న్యాయమూర్తి అన్నారు. ఉద్దానంలో కిడ్నీ వ్యాధులు దయాలసిస్ స్టేజికి వచ్చినంత వరకు తెలియడం లేదని డీఎంహెచ్ఓ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇక్కడ ఆరు నెలలుగా సర్వే జరుగుతోందన్నారు. వ్యాధిని ముందుగానే గుర్తిస్తే జీవిత కాలం పెరుగుతుందని అన్నారు.



# వైఎస్సార్ సీపీలో పలు కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మండలంలోని పెద్దలక్ష్మీపురం గ్రామానికి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ మొదలవలస రాము శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో 30 కుటుంబాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ధవళి పోలినాయుడు, ధవళి లోకనాథం, సురవరపు హేమసుందరరావు, మెట్ట చిరంజీవి, మామిడి లక్ష్మి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, సచివాలయ మండల కన్వీనర్ వై.సూర్యం, పీఏసీఎస్ డైరెక్టర్ పడాల రంజిత్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జి.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



## ఆటో నుంచి జారిపడి మహిళ మృతి



ఆటో నుంచి జారి పడి మృతి చెందిన పార్వతి

కోటబొమ్మాళి: స్థానిక స్టేట్‌బ్యాంకు సమీపంలో ఆటో నుంచి జారిపడి నందిగాం మండలం లఖిదేశపురం గ్రామానికి చెందిన బతకల పార్వతి(45) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పార్వతి శుక్రవారం కోటబొమ్మాళిలో జరిగిన ఒక శుభకార్యానికి కేటరింగ్ చేయడానికి వచ్చారు. కార్యక్రమం ముగియడంతో శనివారం స్వగ్రామం వెళ్లేందుకు ఆటో ఎక్కగా స్టేట్‌బ్యాంకు సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో నుంచి జారిపడిపోయారు. తలకు బలమైన గాయం కావడంతో ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పార్వతికి భర్త అప్పారావు, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ విశ్వేశ్వరరావు తెలిపారు.

## పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

కోటబొమ్మాళి: నిమ్మాడ జంక్షన్‌కు చెందిన ఆవల రాజారావు (52) పురుగుల మందుతాగి మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. రాజారావు కిడ్నీవ్యాధితో బాధ పడుతూ ఈనెల 20న తన ఇంట్లో పురుగు మందు తాగేశారు. చికిత్స కోసం రాజారావును రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాజారావు మృతి చెందారు. మృతునికి భార్య తవిటమ్మ, కుమారులు ధర్మారావు, కిరణ్ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహ్మద్ అలీ తెలిపారు.

## టెన్త్ మూల్యాంకనానికి సహకరించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: త్వరలో మొదలుకానున్న పదో తరగతి మూల్యాంకనంలో ఉపాధ్యాయులంతా సహకరించి విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం జిల్లాలోని గుర్తింపు కలిగిన ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో సమన్వయ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలోని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో జరిగిన ఈ సమన్వయ సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ జిల్లాలో టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో జరుగుతున్నాయని సంతోషం వ్యక్తంచేశారు. అదే స్ఫూర్తితో మూల్యాంకనంలో కూడా పనిచేసి సక్సెస్ చేయాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయ సంఘాల నుంచి వినతులు, సూచనలు, సలహాలను స్వీకరించారు.

## ప్రతి వాహనం తనిఖీ చేయండి: ఎస్పీ

రణస్థలం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. మండలంలోని పైడిభీమవరం అంతర్ చెక్‌పోస్టును డీఎస్పీ వై.శృతితో కలిసి ఆమె శనివారం తనిఖీ చేశారు. వాహనాల రాకపోకలు గమనించి తనిఖీ రికార్డులను పరిశీలించారు. అక్రమ మద్యం, గంజాయి వంటి అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీలను వీడియో కెమెరాలో రికార్డు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.